క్లుప్తంగా

తుక్కుగూడ-శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సు సర్వీసు

నేటినుంచి ప్రారంభించనున్న ఆర్టీసీ

మహేశ్వరం: తుక్కుగూడ- శంషాబాద్ వయా ఎయిర్‌పోర్టు నుంచి రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నట్లు మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహేశ్వరం డిపో నుంచి తుక్కుగూడ నుంచి శంషాబాద్ వయా ఎయిర్‌పోర్టు వరకూ ప్రతి 45 నిమిషాలకు ఒక ట్రిప్పు నడుపుతారని తెలిపారు. ఈ సర్వీసు గురువారం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నిత్యం శంషాబాద్, తుక్కుగూడ వెళ్లే వారికి ఈ బస్సు సర్వీసులు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ అవకాశం ప్రతి ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు



కందుకూరు: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు

కందుకూరు: మెరుగైన సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ జంగారెడ్డి కోరారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా మౌలిక వసతుల పనులు పూర్తిచేసి బుధవారం వినియోగంలోకి తెచ్చారు. కాగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం శ్రీశైలం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు. మండలంలో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ టి.మనోహర్, ఎంపీడీఓ సరిత, మాజీ ఎంపీపీ మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఇందిరాదశరథ, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శోభ, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్లు కృష్ణ, యాదయ్య, మహేందర్, విజయ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, పాండు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీసత్యసాయి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని లక్ష్మిప్రియ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాలలో 685 మార్కులతో ఆలిండియా 6666 ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి పాఠశాల ప్రిన్సిపాల్ నాగలింగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థిని లక్ష్మిప్రియ, తల్లితండ్రులు మల్చలం మురళీ, మేఘన దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత, ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

15న ఆలయ భూముల కౌలుకు వేలం

కొందుర్గు: కొందుర్గు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబంధించిన భూములను ఈ నెల 15న వేలం వేయనున్నట్లు ఈ శ్రీనివాసశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగన్నగూడ గ్రామ పరిసర ప్రాంతంలో గల వ్యవసాయ భూములను మూడేళ్లపాటు పంటలు సాగుచేసుకోవడానికి ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలంలో పాల్గొనేవారు ముందుగానే రూ.2వేలు దరావత్ చెల్లించాలన్నారు.

నేడు మండల సమావేశం

మొయినాబాద్‌రూరల్: నేడు మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి సభ్యుల ఫోరం లేనందున వాయిదా వేశామని సూచించారు. తిరిగి ఈ సమావేశాన్ని 13వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు గునుగుర్తి నక్షత్రం అధ్యక్షతన నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీతో పాటు పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు సమయానికి హాజరుకావాలని ఆమె కోరారు.



మహేశ్వరం:తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలలో యూనిఫాం పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



పహాడీషరీఫ్: పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు

విద్యార్థులు కష్టపడి చదవాలి

మహేశ్వరం: మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు-14 ప్రాథమికోన్నత పాఠశాలలు-11, ప్రాథమిక పాఠశాలలు-29 మొత్తం 56 పాఠశాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి పుస్తకాలు, నోట్ బుక్స్, ఉచిత యూనిఫామ్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రారంభం తొలి రోజు కావడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది.

పహాడీషరీఫ్: విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శ్రీరాం కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుమతమ్మతో కలిసి బుధవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారన్నారు. ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను కూడా అందిస్తారన్నారు. మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఈ పాఠశాలలో స్థానిక దాత దామోదర్ సచిన్ సోని సహకారంతో అన్ని రకాల సదుపాయాలు కూడా కల్పించడం జరిగిందని తెలిపారు.

హుడాకాంప్లెక్స్: విద్యా సంవత్సరం పునఃప్రారంభం సందర్భంగా సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్ నగర్ ప్రభుత్వ పాఠశాలను బుధవారం స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు, దుస్తులను అందజేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలల్లో స్కావెంజర్స్, ఉపాధ్యాయుల కొరతతో పాటు నీటి సరఫరా వంటి సమస్యలను పరిష్కరించాలని లేఖ రాసి విద్యాశాఖకు పంపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరతతో పాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరని, మరుగుదొడ్లు కూడా లేవన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని శ్రీవాణి డిమాండ్ చేశారు.



బడంగ్‌పేట్: బాలాపూర్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు కలిసి బాలాపూర్ మండలంలోని బాలాపూర్, బడంగ్‌పేట్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, బందారి మనోహర్, నాయకులు ఎర్ర జైహింద్, లిక్కి కృష్ణారెడ్డి, రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, హెచ్‌ఎం అర్జున్, రమాంజులురెడ్డి, రహీం, సునీత, సరోజ తదితరులున్నారు.

తుక్కుగూడ: పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఉచిత పుస్తకాలు, నోటుబుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: మంఖాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సిబ్బంది



మొయినాబాద్‌రూరల్: ఎన్కెపల్లి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న పోచయ్య, సిబ్బంది

జోరుగా.. హుషారుగా..



పులిమామిడి పాఠశాలకు మొదటిరోజు వస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

- మొదటిరోజు హాజరు అంతంతే
- యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందజేసిన ఉపాధ్యాయులు



గూడూరు పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో సందడి నెలకొంది. విద్యార్థులు ఉదయమే హుషారుగా పాఠశాలలకు బయలుదేరి వెళ్లడం కన్పించింది. కాగా మొత్తం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4,328 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. అందులో మొదటిరోజు బుధవారం 43 శాతం వరకు హాజరు నమోదైంది. ఉపాధ్యాయులు అందరూ హాజరయ్యారు. ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంతో పాటు నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేశారు.

సంతోషంగా ఉంది..



పాఠశాలకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మా స్కూల్‌కు రంగులు వేసి ముస్తాబు చేశారు. కొత్త కొత్తగా అనిపిస్తోంది. నేను భవిష్యత్‌లో లాయర్ కావానుకుంటున్నాను.

– విశ్వేశ్, 9వ తరగతి విద్యార్థి, పులిమామిడి

సరస్వతీ శిశుమందిర్‌లో గాయత్రీ యజ్ఞం

మొయినాబాద్: పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఉన్న రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బుధవారం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. పాఠశాల కమిటీ కార్యదర్శి దోమ కృష్ణగౌడ్ దంపతులు, కోశాధికారి బద్దం ప్రతాప్‌రెడ్డి దంపతులు పూజా కార్యక్రమాల్లో కూర్చొని యజ్ఞం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఓంరెడ్డి, ప్రధానాచార్యులు మమతారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ బాధ్యత గ్రామపంచాయతీలదే

బడిబాట సమీక్షా సమావేశంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ బాధ్యత గ్రామపంచాయతీలు తీసుకోవాలని జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో బడిబాట సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు తమవంతు సహకారం అందించాలని కోరారు. పాఠశాలల్లో పరిశుభ్రత సక్రమంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు గురవుతారన్నారు. మౌలిక వసతుల ఏర్పాటులో పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహించకుండా పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. పాఠశాలల్లో కావాల్సిన వసతులను ఏర్పాటు చేసేందుకు సిబ్బందిని నియమించి ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాఠశాలల అభివృద్ధి బాధ్యతను తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బన్సిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంపై ఆరోపణలు బాధాకరం

- రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు రమేష్‌గౌడ్



మాట్లాడుతున్న రమేష్‌గౌడ్

బడంగ్‌పేట్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు బాధాకరమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు జిల్లా రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం అల్మాస్‌గూడలో విలేకరుల సమావేశంలో రమేష్‌గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు నిరంతం కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిందలు వేసేందుకు పాడి కౌశిక్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నాడన్నారు. అవినీతి మరకలేని పొన్నంపై ఆరోపణలు చేస్తున్న కౌశిక్ కబర్దార్ అని హెచ్చరించారు. పాడి కౌశిక్‌రెడ్డి వ్యక్తిత్వం గత ప్రభుత్వంలోనే బయటపడిందన్నారు. ప్రజలను బ్లాక్‌మేల్ చేసే నువ్వు మంత్రిపై ఆరోపణలు చేసే స్థాయి నీదికాదన్నారు. ఈ విషయంలో మంత్రి పొన్నంకు కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని లేకుంటే ప్రజాక్షేత్రంలో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మారగాని వేణుమాధవ్, కుంభం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



కొత్తపేట: పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. బుధవారం కొత్తపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాల విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని మంచి మార్కులు సాధించాలని సూచించారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణరెడ్డి, శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు మంచి రాజేష్, కొత్త తిరుమల్, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై చర్యలు



ఎల్‌బీనగర్‌లో ప్రైవేట్ పాఠశాల బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

నాగోలు: రోడ్డు భద్రతా నిబంధనలను పాటించకుండా పాఠశాల, కాలేజీ విద్యార్థులను బస్సుల్లో తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నాగోలు ఆర్టీఓ పి. రవీందర్‌కుమార్ ప్రైవేట్ విద్యాసంస్థలను హెచ్చరించారు. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్, నాగోలు పరిధిలోని స్కూలు, కాలేజీల బస్సులను తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, టాక్సీలకు సంబంధించిన పలు ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా విద్యార్థులను తరలిస్తున్న 18 స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు ఆర్టీఓ రవీందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 ఏళ్లు దాటిన ఏ బస్సును రోడ్డుపై నడపవద్దని, ఎవరైనా నడిపితే బస్సును సీజ్ చేయడంతో పాటు సదరు విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యవంతులై 60 ఏళ్ల లోపు వయసు ఉన్న వారిని మాత్రమే డ్రైవర్లుగా నియమించుకోవాలని సూచించారు. డ్రైవర్లు మద్యం తాగి బస్సును నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడం వంటివి చేయరాదని అన్నారు. వాహన తనిఖీల్లో ఎంవీఐలు కె. రవీందర్ రెడ్డి , కె.అమర్‌నాథ్, ఎం,అనిత తదితరులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా పనిచేయండి

– ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. షాద్‌నగర్ నుంచి పరిగి ఆర్‌అండ్‌బీ రోడ్డును నాలుగులేన్ల రోడ్డుగా ఏర్పాటు చేయడానికి పరిగి ఎమ్మెల్యేతో కలిసి ప్రతిపాదనలు పంపించామన్నారు. కొందుర్గులో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల సిబ్బందికి సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ రాగమ్మ, వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ లాలయ్య, ఎంఈఓ కిష్టారెడ్డి, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. వైస్ ఎంపీపీ ఆశ్రాబేగమ్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ ప్రవీన్ కుమార్ పాల్గొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



బాలాపూర్ చౌరస్తాలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి



బడంగ్‌పేట్: ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గుర్రంగూడ వాసులు

మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేట కమాన్ వరకు రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను బుధవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని, అందులో భాగంగానే బాలాపూర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. త్వరలోనే మీర్‌పేట పెద్ద చెరువు, మంత్రాల చెరువుల వద్ద వీలైనంత త్వరగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం జీహెచ్‌ఎంసీలో విలీనం అయ్యేలోపే ప్రతి బస్తీ, గల్లీల్లో లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, డీఈ వెంకన్న, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, సౌందర్య, సిద్దాల బీరప్ప, భీంరాజ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బడంగ్‌పేట్: గుర్రంగూడలో నెలకొన్న సమస్యలు తీర్చాలని బుధవారం మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ ఆదిత్యనగర్ కాలనీకి ప్రధాన రహదారి లేక ప్రజలు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంతలమయమైన మట్టిరోడ్డును బాగు చేయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అదేవిధంగా ఇతర అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో పనులు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లగ్గాల సంజీవ తదితరులు ఉన్నారు.